

ఉదయభానుని లేతకిరణాలు వెచ్చ వెచ్చగా ప్రసరించి మంచును పటాపంచలుచేసి ప్రపంచానికి నూతనోత్సాహం కలుగ జేస్తున్నాయి. రాత్రి నిద్రవల్ల కలిగిన బద్ధకాన్ని, శీతాకాలపు రాత్రి చలి మూలంగా కలిగిన వణుకునూ మెల్లిగా వదుల్చుకొని ప్రపంచం కొత్త రోజులోకి ప్రవేశించింది.

ఉదయం ఏడు గంటలు కావస్తోంది......

అప్పుడే తిరిగి ఇంటికొచ్చిన కోటేశ్వర్రావుగారు బావి దగ్గర కాళ్ళు కడుక్కొని, నోటిలో వదురుపుల్లతో పక్కనేవున్న గేదె కొట్టంలోకివెళ్ళి గేదె ముందు ఇంత గడ్డి పడేశారు. అది గడ్డి నములుతూ వుంటే ఆమె ప్రేమతో దాని శరీరం నిమురుతూ నిల్చున్నారు. ఇంటిల్లిపాదికీ పాలు, వెన్న, పెరుగుకూ ఆధారమయిన జీవి యిది.

"త్వరగా ముఖం కడుక్కోవటం పూర్తి చెయ్యి నాన్నా అవతల కాఫీ చల్లారిపోతోంది" ఇంట్లోనుంచి ఆయన ఆఖరి కూతురు సరోజ కేక వేసింది.

"ఇదుగో తల్లీ, అం పోయింది. వస్తున్నా" అంటూ, ఆయన నోట్లో పుల్లను అవతల పారేసి, గొట్టుపై కప్పులోనుంచి చిన్న తాటాకు [illegible] మళ్ళీ బావి దగ్గరకొచ్చి చేదతో నీళ్ళు తోడుకొని ముఖం ప్రక్షాళన చేశాడు.

కోటేశ్వరరావుగారు ముందు వసారాలోకి వచ్చి, తువ్వాలుతో ముఖం తుడుచుకొంటుండగానే సరోజ గాజు గ్లాసుతో చిక్కటి కాఫీ తెచ్చి యిచ్చింది. ఆయన గ్లాసు అందుకొని, మంచం వాల్చుకొని కూర్చుంటూ, "ఇంకా సుందరం లేవలేదుటే" అన్నాడు.

వెనక్కి తిరిగి వెళ్ళిబోతున్న సరోజ తండ్రి మాటలు విని, గిర్రున ఇటు తిరిగింది. ఆ తిరగటంలో ఆమె పొడుగాటి జెడ వెళ్ళిన ముందుకొచ్చి పడింది. జెడను మళ్ళీ వెనక్కి వేసుకొంటూ, ఆమె, "అన్నయ్య ఇంకా లేవలేదు నాన్నా. ఇవ్వాళ సెలవుటగా" అన్నది సన్నటి మధురమయిన కంఠంతో.

"సెలవయితే మటుకేమిటి? వాడిని లేపి ఒక గ్లాసుడు కాఫీ ఇవ్వు అసలు వా పిచ్చిగాని, ఈపాటికి అమ్మాయి వాడికి కాఫీ ఇచ్చేవుంటుంది. అది తాగి, మళ్ళీ పడుకొని వుంటాడు" అన్నాడాయన నవ్వుతూ. అంతన "అమ్మాయా" అని కోడలు వళినిని [illegible] ఉంటాడు

తండ్రి చెప్పినది ఆమోదించినట్టుగా సరోజ ఒక చిరునవ్వు నవ్వి, ఇంట్లోకి వెళ్ళింది. ఆమె నవ్వినపుడు బుగ్గలమీద పడిన గుంటలు ఆమె అందానికి కొత్త తెచ్చినాయి. కోటేశ్వరరావు పెదవులు

కూతురివేపే చూస్తూ, "దీన్ని ఎవరి చేతులలో పెట్టవలసి వస్తుందో? ఒక్క సంగతిమటుకు నిజం. ఇది ఎవడికి దక్కినా, వాడు సుఖ పడతాడు. ఇది అజాత శత్రువు. అందుకనే సుందరంతో 'మనకు పెద్ద సంబంధాలు వద్దురా. మనం తూగలేము. బుద్ధిమంతుడూ, చదువుకొన్నవాడూ ఎవరయినా మీ కానిస్టేబుల్సులోవుంటే చూడరా' అని చెప్పాను" అనుకొన్నాడు మనస్సులో.

కోటేశ్వర్రావుగారు ప్రభుత్వోద్యోగంచేసి, పింఛను పుచ్చుకొంటున్నారు. ఉద్యోగంలో సంపాయించి మిగిల్చిందేమీలేదు. ముందు పుట్టిన ముగ్గురూ ఆడపిల్లలే కావటంచేత ఆయన సంపాదన వాళ్ళను ఇంటినుంచి పంపించటానికే సరిపోయింది. ముగ్గురు ఆడపిల్లల తరువాత పుట్టిన వాడవటంచేత సుందర్రావు చాలా గారాబంగా పెరిగాడు. ఇతడి దురదృష్టంకొద్దీ ఇంటర్మీడియేట్ చదువుతుండగా తండ్రి రిటైరవటం, ఆ ఏడే తల్లి పోవటం, ఇతడి మనస్సు వికలమం [illegible] ఆ ఏడు పరీక్ష తప్పటం అన్నీ వరుసక్రమంలో జరిగాయి. కోటేశ్వర్రావుకు కొడుకుని కనీసం బి. ఏ. వరకయినా

42 వ పేజీ చూడండి

## మంచి పుస్తకాలు

జీవిత రహస్యాలు:- మీ దాంపత్యసుఖానికి అనేక కామ సూత్రాలు:-_____ రూ 3-50
యువతి:- స్త్రీలను గురించి అనేక కుతూహల విషయాలు_____ రూ 3-50
సంతానము:- గర్భనిరోధానికి 60 నవీన సులభ మార్గాలు_____ రూ 3-50
ఆమ్లిక రహస్యాలు:- వ్యాపారంలో లక్షలు సంపాదించే అనేక కొత్తదారులు. రూ. 6-00
ఉద్యోగదర్శిని:- మనదేశంలోని అన్నిరకాల ఉద్యోగాలు, అర్హతలు, పొందే మార్గాలు రూ 5-00
ఆత్మజ్ఞానము:- శరీరానంతరం ఆత్మను గురించిన నవీన శాస్త్ర పరిశోధనలు. రూ 2-50
పోస్టు ఖర్చులుచితం. శ్రద్ధ ఎడ్రస్సుకు వ్రాస్తే వి. పి. పోస్టుద్వారా మీయింటికి పంపబడును.

దేశసేవ ప్రచురణలు, ఏలూరు, ఆంధ్ర



## మంచి రహస్యం

**గ్లోరియా** ద్రవాన్ని, మీ ముఖానికి రుద్ది తుడిచినంతలో అద్భుతమైన కాంతిని, మంచి అందాన్ని వెంటనే తెచ్చును ముఖంలోముదిరూపును పోగొట్టి చక్కని లేతదనాన్ని తెచ్చును. ఎండకు వచ్చే నలుపును, మొటిమలను నమ్మకంగా పోగొట్టును.
వెల రూ. 1-75 అన్నిషాపుల్లో దొరకును

JANITA PRODUCTS ELURU. A.P.



ఒక ముఖ్యవార్త-నవీన తయారీ
పిక్నిక్ పాకెట్ రేడియో
ధర సగానికి తగ్గించబడినది.

జపాను పాకెట్ రేడియోనృష్టి సిగరెట్ కేసుకంటె చిన్నది. తేలికైనది. స్థానికంగా ప్రపంచంలో ప్రతిస్టేషను వినవచ్చును. ఇతర రేడియోలకంటే తక్కువ ఖర్చు సులభముగా ఉంచుకొనుటకు అనువైనది. అందమైనది. బ్యాటరీ సెల్సుతో పాటు ఉపయోగమునకు సిద్ధముగా పంపబడును. 3 సం. గ్యారంటీ. నెం. LR 77 ధర రు. 32/-
డీలక్సురకం నెం. GM156 ధర రు. 45-50
వి. పి. పి. చార్జీలు రు. 3-50 అదనం.
రేడియోకు తోలు కేసు ధర రు. 5-50.
ఇంగ్లీషులోనే వ్రాయవలెను.



KUBER & CO., (AP-32)
Post Box 1268, DELHI-6.



# నాణ్యత మరియు పొదుపు
# కుటుంబం అంతటికి



ఎంతో పొదుపు. ఎంతో ఉల్లాసకరం! ఈ పెద్ద సైజు టాల్కు ప్రఖ్యాత కాల్గేట్ శ్రేష్ఠత కలిగివుంది.



ఎంతో సువాసన! ఎంతో కాలం వస్తుంది! స్నానం చేసాక-బయటకు వెళ్ళే ముందు హాయిగా ఈ పౌడరు యథేచ్ఛగా చల్లుకొన వచ్చు.



ఎంతో మృదు మార్దవమైనది! ఎంతో మెత్తనిది! కాల్గేట్ బహుళ వినియోగ టాల్కును శిశువు ఎంతో ప్రేమిస్తుంది. సున్నిత చర్మాలకు తగినది.




## కాల్గేట్
*బహుళ వినియోగ టాల్కు*
అపురూపమైన పువ్వుల శాశ్వత సువాసనగలది!


# ప్రాయశ్చిత్తం

19-వ పేజీ తరువాయి

చదివించాలని కోరిక ఉన్నది. అందుచేతనే సుందరరావును చదవమని పోరు పెట్టాడు. కాని, సుందరరావు అందుకు సుతరామూ ఒప్పుకోలేదు. అతడికి ఇంటి పరిస్థితులు కరతలామలకం. తాను వెంటనే ఏదయినా ఉద్యోగం వెతుక్కోకపోతే ఇంటిగౌరవం నిలబడదని గ్రహించి, ఆ ప్రయత్నంలో మునిగిపోయ్యాడు. పలుకుబడిలేక, పెద్ద చదువులూలేని సుందరరావుకు ఉద్యోగమే దొరకలేదు. రోజులు గడుస్తున్నకొద్దీ, తండ్రికి రిటైరయిన తరువాత చేతికొచ్చిన పైకం తిరిగిపోతూ వుంటే, భవిష్యత్తును తలుచుకొని కంపించిపొయ్యేవాడు. విసిగి, వేసారి చివరికి సుందరరావు పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగానికి దరఖాస్తు పడేశాడు. ఆజానుబాహుడు, చదువుకొన్నవాడు, ఆకర్షణీయమయిన విగ్రహం కలవాడవటంచేత సుందరరావు ఆ ఉద్యోగానికి ఎన్నుకోబడ్డాడు. విజయనగరం పోలీసు ట్రయినింగ్ స్కూలులో ట్రయినింగ్ అయిపోయిన తరువాత సుందరరావును గుంటూరు జిల్లాలోని పెదనందిపాడు పోలీసు స్టేషనులో నియమించారు. తరువాత ఆరు నెలలకే వెంయ్యిన్నూట పదహార్ల కట్నంతో పెళ్ళి కూడ జరిగిపోయింది. అతడి భార్య నళిని, కొద్దిగా చదువుకొన్నపిల్ల కావటంచేత దర్పం లేక ఒద్దికగా సంసారాన్ని నిర్వహించు కొస్తోంది.......

ఇదీ ఈ కుటుంబపు సంక్షిప్త పూర్వగాథ......

సుందరరావు లేచి, ముఖ ప్రక్షాళన పూర్తి చేసుకొని, కాఫీ గ్లాసు చేతిలో పట్టుకొని వసారాలో కొచ్చాడు. కోటేశ్వరరావు మంచంమీద కూర్చుని వార్తాపత్రిక చదువుతున్నాడు. సుందరరావు తాను కూడ వెళ్ళి తండ్రి పక్కనే కూర్చుని వార్తా పత్రికలోని లోపలి రెండు పేజీలు తీసుకొని చదవటం మొదలు పెట్టాడు. ఇద్దరు మౌనంగా అయిదు నిముషాలు పత్రిక చదవటంలో నిమగ్నులయ్యారు. ఇంతలో అక్కడికి సరోజవచ్చి "బాగుంది! ఇద్దరూ అట్లా పేపరు చదువుతూ కూర్చుంటే కోమటికొట్టు కెళ్ళి సేమియా పొట్లం నేను తెచ్చేదా?" అన్నది, చిరుకోపంతో.

తండ్రి కొడుకులు ఒక్కసారి తలఎత్తారు. కోటేశ్వరరావుకు ఇంత అర్థాంతరంగా సేమియా పొట్లం కావలసిన అవసర మేమిటో తెలియలేదు. ఇవ్వాళ ఏ పండుగాకాదు. కనీసం పర్వదినమయినాకాదు. "ఇప్పుడు సేమ్యా పొట్లం ఎందుకే"

"అయ్యో! నీ కింకా తెలియదా నాన్నా? ఇవ్వాళ వదిన పుట్టిన రోజు పండుగకాదూ?"

"అదేమిట్రా? నా కెవరూ చెప్పనేలేదే? సుందరం! అమ్మాయికి చీరయినా కొన్నావా?"

సుందరరావు లేదన్నట్లుగా తల వూపాడు.

"అదేం పనిరా? పుట్టినరోజు పండక్కి చీరయినా కొనుక్కోరూ? బాగానేవుంది"

"అవునులే! మొన్న నా పుట్టినరోజు పండక్కి ఒక వోణీతెచ్చి పడేశారూ! ఇప్పుడు వదినకు చీరె కొనండి. అంతే" అంటూ సరోజ ముఖం ముడుచుకొన్నది.

ఇంతలో లోపలినుంచి నళిని, "ఇంకెన్ని రోజుల్లే సరోజా? వచ్చే పుట్టినరోజు పండక్కి ఆ వచ్చే ఆయనే చీర కొంటాడు" అన్నది.

"ఆ! కొంటాడు!! ఇప్పుడు అన్నయ్య నీకు కొన్నాడుగా! అట్లాగే ఆయనా నాకు కొంటాడు.... సరేగాని అన్నయ్యా! నేమ్యా సంగతి మర్చిపోకు" అంటూ సరోజ ఇంట్లోకి వెళ్ళింది.

సరోజ వెళ్ళాక రెండు నిముషాలు ఎవరూ మాట్లాడలేదు. కోటేశ్వర్రావు, "అది అన్నమాటలు నిజమేరా! అమ్మాయికి చీరయినా కొని ఉండా ల్సింది. ఈ డబ్బు ఇబ్బందులు ఎప్పుడు ఉన్నవేగా?" అన్నాడు.

"పోనీలే నాన్నా! ఇప్పుడు ఎక్కడో అప్పుచేసి.."

ఇంతలో బైటినుంచి, "సుందర్రావ్" అనే కేక విన్పించింది. సుందర్రావు కాఫీ తాగటం పూర్తి చేసి గ్లాసు కింద పెట్టి బయట కెళ్ళాడు. బయట పోలీసు కానిస్టేబుల్ లతీఫ్ నిల్చుని ఉన్నాడు.

"ఏమిటి లతీఫ్‌భయ్యా?"

"ఏమీలేదు భాయీ! ఎస్. ఐ. గారు నిన్ను వెంటనే రమ్మన్నారు.

మహమ్మదీయులలో తెలుగు ఉచ్చారణ లోప భూయిష్టంగా ఉంటుందనే లోకోక్తి లతీఫ్ మాట్లాడే తెలుగు వింటుంటే అబద్ధమనిపిస్తుంది.

"అదేమిటి లతీఫ్? ఈరోజు నాకు 'ఆఫ్' కదూ? నన్నెందుకూ రమ్మనటం?"

"నీకింకా తెలియనే తెలీదా? మామిళ్ళపాడు కరణంగారింట్లో తెల్లవారుజామున దొంగతనం జరిగింది. సుమారు రెండువేల రూపాయలు దోచుకొన్నారుట. ఎస్. ఐ. గారూ, 'హెడ్' గారూ వెడుతున్నారు. ఎక్కడికైనా 'రైడ్' వెళ్ళాల్సింటుందేమోనని, నిన్ను మరోరోజు 'ఆఫ్' తీసుకోమని ఇవ్వాళ్టికి డ్యూటికి రమ్మన్నారు. త్వరగా వచ్చేయ్... అంటూ లతీఫ్ త్వర త్వరగా వెళ్ళిపొయ్యాడు.

సుందర్రావు లోపలి కొచ్చాడు. "దిక్కుమాలిన ఉద్యోగంనాన్నా! ఛీ! ఛీ! వారాని కొకరోజయినా రెస్టు తీసుకోవటానికిలేదు. నేరకపోయి చేరాను. చస్తున్నాను" అన్నాడు విసుగుతో.

"బాగుందిరా. ఇట్లా చీటికి మాటికి విసుక్కొంటుంటే ఎట్లా? ఉద్యోగం అన్న తరువాత అన్నీ ఈ రకంగానే అఘోరిస్తాయి. ఏ ఉద్యోగం లోనూ పరిపూర్ణమయిన తృప్తి, స్వాతంత్ర్యమూ లేదనుకో" అన్నారు కోటేశ్వర్రావుగారు.

"అదికాదునాన్నా. ఇవ్వాళ నాకు రెస్టుకదా? ఈ ఖూనీలూ, దొంగతనాలూ ఎప్పుడూ ఉండేవే. నా కోసరం ప్రత్యేకంగా కబురు చేయటం ఎందుకు? అసలు సంగతి ఏమిటంటే నేనంటే మా ఎస్. ఐ. కి 'హెడ్' కు మంట. అందరిలోకీ నే నొక్కడినేగా చదువుకొన్నది"

"అబ్బాయ్. ఉద్యోగం చేస్తున్నంతకాలం అందరితో మంచిగా ఉండి, నెట్టుకు రావటమే గొప్ప. తెలిసిందా?.......అయినా ఇంకెంత కాలం చెప్పు? ఆ సర్వీసు కమిషను సెలక్షను రాగానే ఈ ఉద్యోగం ఎటూ వదిలేసేదేగా?......."

"అంతేలే. ఆ సెలెక్షన్ వచ్చిన మరురోజే ఎస్. ఐ. మొహంమీద కొట్టినట్టు రాజీనామా కాగితం ఇవ్వనా?" అంటూ సుందరం విసురుగా లోపలికెళ్ళి "నళినీ" అని కేకేశాడు.

"వస్తున్నానండీ" అంటూ, లోపలినుంచి నళిని వచ్చింది. ఆమె ముఖంలోని చిరునవ్వు, కళ్ళలోని కాంతి ఆమెకు ప్రత్యేకమయిన శోభను తెచ్చి పెట్టినాయి.

"నళినీ ఇప్పుడు నేను డ్యూటీకి వెళ్ళాలి"

"అదేమిటండీ? ఇవ్వాళ........"

"ఈ ఉద్యోగానికి సెలవు కూడానా? వెంటనే రమ్మనమని తాకీదు పంపించాడు ఆ ఇన్‌స్పెక్టరు. తప్పేదేముంది? పెట్టెలో డ్రస్సు వున్నదికదూ? తీసి రెడీగా పెట్టు. నేను నీళ్ళు పోసుకుని వస్తాను" అంటూ సుందర్రావు తువ్వాలు కట్టుకొని మరో తువ్వాలు భుజాన వేసుకొని, బావి దగ్గరకు బయలుదేరాడు. సరోజ ఇది అతడి

## ప్రణయలీల!

**కిళాంబి సరస్వతీదేవి**

నీ జడలోని పూవునై
పూవులోని తావినై
తేనె త్రావు తేటినై
నిను వీడని నీడనై
నీ కోసమె జీవిస్తాను!
నీ ఒడిలోనె మరణిస్తా!!

నీ మదిలో పాటనై
పాటపాడు పిట్టనై
మాటలాడు పికమునై
నాట్యమాడు నెమలినై
నీదరినే సంచరించుతా
నీ యెదలోనే నిదురిస్తా!!

నీ తోడిది నరకమైన
నా పాలిటికది నాకమే
నీవులేని స్వర్గలోకము
నా పాలిటి యమలోకము
నీ కోసమె జీవిస్తాను!
నీ యెదలో నిదురిస్తా!!

వెనకాలే సబ్బుపెట్టె తెచ్చి బావి గట్టుమీద పెట్టి వెళ్ళింది.

నళిని పెట్టెలోంచి ఖాకీదుస్తులుతీసి, ఇవతల పెట్టింది. గుండీలు చిన్న గాజు డబ్బాలోంచితీసి, చొక్కాకు అమర్చింది. ఆ తరవాత "జి. యు." అనే ఇత్తడి అక్షరాలూ, పోలీసు వెంటనే తళ తళా మెరిసేటట్లు పాలిష్ చేసింది ఆ షిప్టుట బూట్లు, బెల్టు, టోపీ పెట్టి చేర టేబిలు మీద పెట్టింది. ఇంతలో సుందర్రావు నీళ్ళు పోసుకొని వచ్చాడు. తన డ్రస్సును అమరుస్తున్న భార్యను చూసేసరికి అతడి కళ్ళు కృతజ్ఞతతో మెరిసినవి.

"ఛీ! ఏం ఉద్యోగం నళినీ. నీ పుట్టినరోజు పండుగనా డయినా ఇంట్లో ఉండలేక పోతున్నాను" అన్నాడు.

భర్త రాక గమనించి, పాలిష్ చేయటంపూర్తి చేసి నళిని లేచి నిల్చున్నది. "అవేం మాటలండీ? మనం అనుకొన్నప్పుడు, కావలసి వచ్చినప్పుడు సెలవులు దొరుకతాయా? ప్రతి చిన్న విషయానికి మీరు మనస్సును పాడు చేసుకోకండి. డ్రస్సువేసుకొంటుండండి. నేను ఇప్పుడే కాఫీ తెస్తాను" అంటూ ఆమె లోపలి కెళ్ళింది.

కొద్దిరోజుల క్రితమే కొన్న సెకండ్‌హాండ్ సైకిలెక్కి సుందర్రావు ఇంటినుంచి బయలుదేరే సరికి గంట ఎనిమిదిన్నరయింది.

పిననందిపాడు చిన్న గ్రామం. నందివెలుగు దగ్గిర బస్సు దిగి, వంద గజాలు ముందుకుపోతే చిన్న వంతెన, వంతెన పక్కగా చేలలో గుండా చిన్న బాట కనిపిస్తాయి. ఆ బాట వెంబడే మైలుదూరం నడిస్తే కనిపించే మొదటి గ్రామం పిననందిపాడు. ఈ గ్రామం ఒకవిధంగా పెద్దదనే చెప్పవలసి వస్తుంది. సుమారు వెయ్యి ఇండ్లతో, అన్ని గ్రామాలవలెనే అన్ని రకాల జాతులతో రెండు, మూడు పార్టీలతో, పంచాయితీతో, పంచాయితీ ఆధ్వర్యానవున్న ఒక స్కూలు, రేడియో మొదలయిన సరంజామాతో వున్నది. ఇన్ని ఉన్నా, ఈ గ్రామంలో ఒక్క ప్రభుత్వ కార్యాలయపుశాఖ అయినాలేదు. ప్రభుత్వ ప్రతినిధులనదగినవారు ఆ వూరి పోలీసు స్టేషనులోని సిబ్బంది మటుకే. తత్కారణంగానే పోలీసు సిబ్బందికి ఈ మారుమూల గ్రామంలో ప్రత్యేకమైన హోదా, గౌరవం, స్థానం లభించినవి. మునసబు తనకున్న నాలుగు ఇండ్లలో ఒక దానిని పోలీసు స్టేషను ఏర్పరుచుకోవడానికీ, మరొక దానిని సబ్ ఇన్‌స్పెక్టరు నివాసానికీ ఇచ్చివేశాడు. అట్లాగే వూళ్ళోని మోతుబరి రైతులంతా తమకున్న ఇళ్ళల్లో పోలీసు కానిస్టేబుళ్ళు ఉండటానికి అనుమతించారు. గ్రామంలో మునసబు, కరణం, మోతుబరి రైతు పిచ్చిరెడ్డి వంటి పెద్దలకు ఎటువంటి గౌరవం లభిస్తుందో అటువంటి గౌరవమే పోలీసు సబ్ ఇన్‌స్పెక్టరుకూ లభిస్తుంది. ఆయన కూడ గ్రామ పెద్దలలో ఒకడుగా జమ. గ్రామంలో మంచికి, చెడుకీ ఈయన సలహా తీసుకొంటుంటారు. చుట్టుపట్లవున్న పది పన్నెండు గ్రామాలకు ఇదే పోలీసు స్టేషను. అదే ఆ గ్రామవాసులకు గర్వకారణం......

సుందర్రావు పోలీసు స్టేషనుకు వెళ్ళేసరికి సబ్‌యిన్‌స్పెక్టరు వెంకటస్వామి, హెడ్ కానిస్టేబుల్ ఏసుపాదం ప్రయాణానికి సిద్ధంగా ఉన్నారు. సుందర్రావును చూడగానే వెంకటస్వామి అధికార యుతమయిన స్వరంతో "ఇంత ఆలస్యమయిందేమోయ్? లేఫ్ చెప్పి ఎంత సేపయింది" అన్నాడు.

సబ్ ఇన్‌స్పెక్టరును చూడగానే సుందర్రావు ఎటెన్షన్‌లో నిల్చుని, టకీమని 'సెల్యూట్' చేశాడు. "ఇవ్వాళ నాకు 'ఆఫ్' కదు సార్? అందుకని రెడీగా లేను. లతీఫ్ చెప్పగానే యూనిఫారం వేసుకొని....."

"సరేలే. ఇవ్వాళ నువు డ్యూటీలో వుండు. మేం మామిళ్లపాడు వెడతున్నాం. వచ్చేదాకా మీరంతా ఇక్కడే ఉండండి భోజనానికి వెళ్ళాలంటే ఒక్కొక్కరే వెళ్లిరండి రాత్రికి మళ్ళి రైడ్ వెళ్ళాలి ఉంటుందేమో? ఒరేయ్ రేపు, నువ్వు వెళ్ళి మేజిస్ట్రేట్ గారితో ఈ సంగతి చెప్పి ఆ పోలీ గాడి కేసులో వాయిదా వేయించుకొని వచ్చేయి' అన్నాడు వెంకటస్వామి.

# ప్రాయశ్చిత్తం

"ఏదహోయ్ ఏసుపాదం" అంటూ వెంకట స్వామి సైకిలెక్కాడు. అతడి వెనకాలే మామిళ్ళ పాడునుంచి వచ్చిన ఇద్దరు యువకులూ, ఏసు పాదం, స్టేషను కానిస్టేబులు ధర్మదాసూ సైకిళ్ళ మీద బయలుదేరారు.

వాళ్ళు అటు కను మరుగు కాగానే స్టేషనులో కాన్‌స్టేబుళ్ళందరూ బాతాఖానీలోకి దిగారు.

"సరేగానీ దొంగతనం ఎట్టా జరిగిందంటావ్?"

"ఎట్టాగేంటి? కరణంగారు తలుపులన్నీ బిగించుకొని, ఆరు బయట పడుకుండారంట. ఆడెవడో దొడ్డిదారిగుండా వచ్చి తలుపు లాడ దీసి, నల్లగా సేసేసినాడు. ఇదంతా సూస్తుంటే ఆ నరసింహాలుగాడి ఎవ్వారమే అయ్యుంటుం దిరా."

"అదేమిటి నారయ్యా? ఆ నరసింహాలు ఇప్పుడు జబ్బుతో ఉండాడటగా?"

"జబ్బు, గిబ్బు, అంతా ఎగిరిపోయింటది. వీడికంటే కరణంగారింట్లో జొరబడి ఇంతపని చేయటానికి దమ్ము లెరికుంటయ్‌రా" అని నారయ్య తన నిశ్చితాభిప్రాయం వెలిబుచ్చాడు. అతడితో అందరూ ఏకీభవించినట్లుగా తల లూపారు.

## 2

తరువాత సుమారు నెల రోజుల సంగతి.

రాత్రి పదిగంటల సమయం. అమావాస్య గాఢాంధకారం. చుట్టుపక్కలవున్న ఏ వస్తువూ కనబడటంలేదు. పొలాలమధ్యవున్న తాటిచెట్లు దయ్యాలవలె నిల్చుని ఉన్నాయి. వాటి మీదినుంచి అప్పుడప్పుడు ఏవో పక్షులు కూతలు వినవస్తు న్నాయి. ఎక్కడో దూరాన పెద్ద కాంతి పుంజం ఉన్న సూచనగా చెట్ల చాటునుంచి విద్యుత్కాంతి గగన సీమలోకి ఎగబాకుతోంది. అది తెనాలి. ఆ పట్టణంలోని విద్యుత్కాంతి ఇక్కడికీ కనిపిస్తోంది.

పెననందిపాడునుంచి వెదుళ్ళపాలెం నాలుగు మైళ్ళు ఉంటుంది. రెండు గ్రామాలకు డొంక దారి తప్ప, మరే, ఇతర మార్గమూలేదు. ఆ డొంక దారివెంట సైకిళ్ళు, రెండెడ్లబండ్లూ తప్ప మరే ఇతర వాహనమూ వెళ్ళదు. ఆ గాఢాంధకారంలో ఆ డొంకదారివెంట మూడు సైకిళ్ళు నిశ్శబ్దంగా వెడుతున్న విషయం, సైకిళ్ళ చప్పుడు వలనగాని తెలియటంలేదు. సుందర్రావు, లతీఫ్, నారయ్య లను వెదుళ్ళపాలెంవెళ్ళి నరసింహాలు దొరికితే పట్టుకురమ్మని వెంకటస్వామి తాకీదు ఇచ్చాడు.

మామిళ్ళపాడులోని కరణంగారింట్లో జరిగిన దొంగతనానికి కారణభూతుడు నరసింహాలేనని వెంకటస్వామికి బలమయిన సాక్ష్యం దొరికింది. నగలమూట పట్టుకొని పారిపోతుంటే చూసిన వారు చెప్పారు. మరికొంత ఆచూకి తీసిన తరువాత నరసింహాలు వెదుళ్ళపాలెంలో ఉన్నట్టు వెంకట స్వామికి తెలిసింది. వెంటనే అతడు హెడ్ కాన్ స్టేబుల్‌ను పిలిచి, "ఏమోయ్ ఏసుపాదం, నర సింహాలుగాడిని లాక్కురమ్మని వెంటనే నలుగురిని పంపు" అన్నాడు.

"నలుగు రెందుకుసార్. ఆ సుందర్రావును, లతీఫ్‌ను పంపితే సరిపోదా? ఎదవకు నలుగు రైదు గురు కావాలా?" ఏసుపాదానికి సుందర్రావంటే ఈర్ష్య. ఇతడు థర్డ్‌ఫారం ఆసర్స్. కాన్‌స్టేబు ళ్ళందరూ, చదువుకొన్నవాడని సుందర్రావును సల హాలు అడగటం, అర్జీలు రాయించుకోవటానికి సుందర్రావునే ఆశ్రయించటం ఏసుపాదానికి కంట గింపయింది. ఇంతకుముందు అందరూ ఏసుపాదాన్నే ఆశ్రయించటం, అతడు ఆ ఆసరాతో వాళ్ళను తన చెప్పుచేతులో ఉంచుకోవటం పరిపాటి.....

"ఆ సుందర్రావును, లతీఫ్‌ను పంపితే ఇక కార్యం సానుకూలమయినట్టే. నరసింహాలు ఇద్దరినీ ఎడా పెడా వాయించి పారిపోతాడు" అన్నాడు వెంకట స్వామి.

"అదేమిటిసార్ ఇద్దరూ దున్నపోతుల్లాగా ఆరడు గులుంటారు. సుందరంగాడికి ఇటువంటివి రుచి చూపించటం చాలా అవుసరంసార్. ఆ లతీఫ్‌గాడూ ఈమధ్య సుందరంగాడితోచేరి చెడిపోతున్నాడు. ఇద్దరినీ వెళ్ళనివ్వండిసార్! ఇంకా జాగ్రత్త కోసర మయితే ఆ నారయ్యను కూడ పంపుదాం."

సర్వసాధారణంగా హెడ్‌కాన్‌స్టేబుల్ మాటకు సబ్‌ఇన్‌స్పెక్టరు అడ్డు చెప్పడు. అట్లా అడ్డు చెబితే స్టేషనులో పని సవ్యంగా జరగదనే సత్యం సబ్‌ఇన్‌స్పెక్టర్లందరికీ తెలుసు. "సరే! అట్లాగే రంపించు. రాత్రి పదింటికి బయలుదేరి వెదుళ్ళ పాలెం వెళ్ళమను. రాజులవీధిలో విస్సన్నగుడిసె వెన కాల గుడిసెలో నరసింహాలు ఉంటాడని వార్త వచ్చింది. వెళ్ళి లాక్కు రమ్మను" అన్నాడు వెంకట స్వామి.

తత్ఫలితమే ఈ ముగ్గురి ప్రస్తుత ప్రయాణం,

వెదుళ్ళపాలెం ఇంకో మైలు దూరంలో ఉం దనగా ఆ నిశ్శబ్ద వాతావరణాన్ని ఛేదిస్తూ సుంద ర్రావు "మన ప్రోగ్రాం ఏమిటి నారయ్యా?" అని ప్రశ్నించాడు. నారయ్య పది సంవత్సరాలనుండీ ఈ ఉద్యోగంలో ఉండటంచేత అతడి సలహా ప్రకా రమే నడవటం ఉత్తమమని సుందర్రావు భావిం చాడు.

"ఇందులో ఏముంది సుందరం? ఆ గుడిసె నాకు తెల్సులే. నేను లోని కెళ్ళి ఆడ్ని లేపి తీసుకొస్తాను. ఎందుకయినా మంచిది, నువ్వూ లతీఫ్ కొంచెం ఎడంగా అటూ, ఇటూ కాపుండండి. దాంతో నా యాలు ఫైసలా. ఇంకో రెండేళ్ళు కట కటాల ఎనకాల తొంగుకుంటాడు."


ముగ్గురూ వెదుళ్ళపాలెం చేరేసరికి వూరంతా మాటుమణిగి వున్నది. వెదుళ్ళపాలెం ఏమంత పెద్ద గ్రామంకాదు. అంతా కలిపితే నో అయిదు వందల గడప ఉంటుంది. ఇంకా గ్రామంలోనికి విద్యు చ్ఛక్తి సరఫరాకాని కారణంచేత వూరు వున్న ఛాయలు లేవు. వీధి లాంతర్లు కూడా వెలగటంలేదు. అంతా నిశ్శబ్ద నిశీథి.

ఈ ముగ్గురు గ్రామంలోకి ప్రవేశించగా వీధిలోని కుక్కలు 'భే' 'భే' మని మొరగటం మొదలు పెట్టినాయి. వీళ్ళకు ఇటువంటి కుక్కల అరుపులు కొత్తకాదు. వాటిని లెక్క చేయకుండా ముందుకు సాగిపోయ్యారు. వాళ్ళు తమనుదాటి పోయిన తరు వాత మొరగటం మానివేసి, తమ ధర్మం సక్రమం గానే నిర్వర్తించామనే ఆత్మ సంతృప్తితో అవి మళ్ళా యధాస్థానంలో పడుకుని నిద్ర కుపక్రమించినవి.

రాజులవీధి వూరికి పడమట వేపున చివర నున్నది. అక్కడికి, వెళ్ళాలంటే గ్రామము మొదట్లోవున్న రెడ్ల వీధిలోంచి వెళ్ళాలి. రెడ్ల వీధిలో అందరూ ఆరు బయట మంచాలు వేసుకొని పడుకొని ఉన్నారు. ఈ ముగ్గురు జాగ్రత్తగా మెల్లిగా సైకిళ్ళు తొక్కుతూ వెడుతున్నారు. అందరూ గాఢ సుషు ప్తిలో ఉండటంచేత ఎవరికీ నిద్రాభంగం కలుగ లేదు. ఒకళ్ళిద్దరికి మెళుకువ వచ్చినా ఆ నిద్ర మత్తులో కళ్ళు తెరిచి సైకిళ్ళను చూసి, తిరిగి పడుకొన్నారు. వీధి దాటుతుండగా ఒక ముసలాయ నకు మెలుకువ వచ్చి "ఎహెయ్! ఎవరోళ్ళు" అన్నాడు.

"పోలీసోళ్ళంలే! నందిపాడునుంచి వస్తుండాం" అన్నాడు నారయ్య.

(సశేషం)



# ప్రాయశ్చిత్తం



వేమూరి సత్యం

(గత సంచిక తరువాయి)

అవతలి వ్యక్తి తిరిగి నిశ్చింతగా నిద్ర కుపక్ర మించాడు.

గ్రామానికి చివరన రాజులవీధి ఉన్నది. ఆ వీధి తరువాత ఇక ఇళ్ళు లేవు. అంతా పొలాలే. ఆ వీధిలో విస్సన్న గుడిసె అన్నిటికన్నా చివర వున్నది. ఆ గుడిసెకు వెనకాలే రెండు గుడిసెలు ఉన్నాయి. రాజుల వీధిలో ఏవో కొన్ని పెంకుటిళ్ళుతప్ప అన్నీ పూరి గుడిసెలే. వీధిలో వరుసగా ఇళ్ళు లేవు. రోడ్లు అసలేలేవు. గజిబిజిగా యిళ్ళు, గుడిసెలూ కట్టబడినాయి. విస్సన్న గుడిసె చుట్టూ రెండు చింత చెట్లు, తాటి చెట్లు విశేషంగానూ ఉన్నాయి. ముగ్గురు తమ సైకిళ్ళను ఒక చింత చెట్టుక్రింద నిశ్శబ్దంగా స్టాండువేసి పెట్టారు.

అంతటా భయంకర నిశ్శబ్దం. పైగా చీకటి. పొలాల్లో కీచురాళ్ళ ధ్వని తప్ప మరేమీ వినరావటం లేదు. సైకిళ్ళను స్టాండువేసి పెట్టగానే నారయ్య మెల్లిగా "సుందరం నువ్వు ఈ చింతచెట్లకాడ నుల్చో. లతీఫ్ నువ్వు అటు పొలం గట్టున తాయి. వాయాలు ఏడకూ పోడనుకో! అయినా మన జాగరత మనది. నేను గుడిసె దగ్గర కెల్తుండా" అంటూ ఆ గాండాంధకారంలో సాగిపొయ్యాడు.

"జాగ్రత్త సుందరం. హుషారుగావుండు" అంటూ లతీఫ్ తనకు నిర్దేశింపబడిన స్థానానికి సాగిపొయ్యాడు.

సుందరం ఒక్కడే మిగిలాడు. అతడికి నిర్దేశించబడిన స్థలం ఇదే. చుట్టూ గాఢాంధకారంలో మిళితమయిన నిశ్శబ్దం. పక్కనే చింత చెట్లు. అతడికి డికి ఒక్కసారిగా వళ్ళు జలదరించింది. చింత చెట్లమీద దెయ్యాలుంటాయని అతడికి చప్పున గుర్తు కొచ్చింది. వళ్ళు గగుర్పొడిచింది. చేతిలో టార్చిలైటు లేదు. సైకిళ్ళకయినా డైనమో దీపాలులేవు. అన్నీ కిరసనాయులు దీపాలే. భయంతో సుందరం ఒక్కసారి తలెత్తి చింతచెట్లకేసి చూశాడు ఆకులు కొద్దిగా కదిలిన చప్పుడయింది. చెట్ల ఆకుల సందులోనుంచి ఏదో కదులుతున్నట్టే అనిపించిం దతనికి. కొద్దిగా చెమట పోసింది. ఇంతలో అతని భయానక ప్రవృత్తిని పరిహసిస్తున్నట్టుగా గుడ్లగూబ ఒకటి వికృతంగా అరుస్తూ, చెట్టుపై నుంచి ఎగిరిపోయింది. "అమ్మయ్య" అనుకొన్నాడు మనస్సులో. మనోధైర్యంకోసరం చిన్న కూనిరాగం ఒకటి మొదలుపెట్టాడు. "ఇంకా రాలేదేమిటే నారయ్య" అ మనస్సులో అనుకొన్నాడు. నారయ్య వెళ్ళి రెండు మూడు నిముషాలె అయినా ...తో సేపయినట్టుగావుందతని ప్రాణానికి

ఇదీ ఉద్యోగమేనా? కిరాతకపు పని! మరీ ఆ సబ్ ఇన్స్పెక్టరు అంత దారుణంగా, కిరాతక ప్రవృత్తితో ఎట్లా ప్రవర్తించగలడో? అత మనస్సు ఎట్లా ఒప్పుతుందో? ఆ 'కోటి' గాడిని ఎట్లా కొట్టాడో. లాఠీలతో కొడుతుంటే రక్తం చిమ్మింది. చూస్తున్న తనకే కన్నీళ్ళొచ్చాయి. చేతు లెట్లా వచ్చాయో? ఇంతా చేస్తే దొంగతనం చేసింది వాడుకానేకాదు. అబ్బబ్బ!..........." సుందరవుకు పది రోజులక్రితం వెంకటస్వామి పోలీసు స్టేషనులో గదిలో కోటిగాడిని కొడుతున్న దృశ్యం కళ్ళ ముందు మెదిలింది. మనస్సు వికలమయిపోయింది.

ఇంతలో విస్సన్న గుడిసె దగ్గిరినుంచి నారయ్య గొంతు గట్టిగా విన్పించింది "పదరా. ఈ యేషాలు నా దగ్గిర పనికిరావు. ముందు పద"

ఆ కేకలతో ఆ చుట్టుపట్ల కొంతమందికి నిద్రా భంగమయింది. లేచారు. సుందరావుకు ఒక విచిత్ర మయిన గగుర్పాటు కలిగింది. నరసింహులు దొరికాడన్నమాట! ఇవ్వాళ వెంకటస్వామి చేతులో వాడి కాలో చెయ్యో విరిగిపోతుంది.........

రెండు క్షణాల పిమ్మట హఠాత్తుగా నారయ్య కేకలు విన్పించాయి. "పట్టుకోండి! నరసింహుల్ని

వాయాలు పారిపోతున్నాడు. సుందరం, లతీఫ్ వదలకండి'' ఆ కేకలతో సుందరం ఇంకా గాభరాపడి పోయాడు.

గుడిసెలలోనుంచి కొంతమంది బయటికొచ్చారు.

సుందర్రావు చింతచెట్టుకింద ఉండటంచేత, ఆ చీకటిలో ఎవరికి విన్పించలేదు. ఆ క్షణంలో అతడి శరీరంలో రక్తపువేగం హెచ్చింది. గుండె కొట్టుకోవటం ఎక్కువయింది. ఆ చీకటిలోకి దృష్టి సారించి చూడటం మొదలు పెట్టాడు. మరుక్షణంలో పది గజాల దూరంలో ఆరడుగుల మనిషి పరిగెత్తుకొస్తున్న జాడ కనిపించింది. అతడు లేని ధైర్యం తెచ్చుకొని వణకుతున్న స్వరంతో ''ఎరది'' అన్నాడు.

చీకట్లో పరిగెత్తుకొస్తున్న నరసింహులు సుందర్రావు కంఠస్వరం విని అక్కన ఆగిపొయ్యాడు. అప్పటికే అతడు సుందర్రావు దగ్గిర కొచ్చేశాడు. అనుకోని ఈ సంఘటనకు నరసింహులుకు వణుకు పుట్టింది.

సుందర్రావు, ''ఆగు! ఎవరు?'' అన్నాడు ఎలాగో లేని ధైర్యం తెచ్చుకొని.

''బాబ్బాబు. కనికరించండి. నాకేటీ తెల్దు. ఈళ్ళు నన్ను స్టేషనుకు తీసికెళ్ళి చావగొట్టి నేనే సేశానని సెప్పిస్తారు. చంపుతారు బాబూ. పిల్లలు గలోణ్ణి. ఆళ్ళను అన్యాయం చేయకండి'' అంటూ నరసింహులు ఒక్కసారిగా సుందర్రావు కాళ్ళు పట్టుకొన్నాడు.

కొద్దిదూరంలో నారయ్య కేకలూ, గ్రామస్తుల మాటలూ వినబడుతున్నాయి. సుందర్రావు కర్తవ్యతామూఢుడయి నిల్చున్నాడు. అతడిపై నరసింహులు మాటలు పని చేసినయి. సుందర్రావు అట్లా నిల్చోవటం నరసింహులు గ్రహించి చటుక్కున లేచి నిలబడి కుడివేపు పరిగెత్తటం మొదలు పెట్టాడు. అటువేపే లతీఫ్ ఉన్నాడు.

నరసింహులు అటు పరిగెత్తగానే సుందర్రావు తేరుకొన్నాడు. తన తప్పిదం తెలిసొచ్చింది. ''పట్టుకోండి, పట్టుకోండి'' అంటూ నరసింహులు వెనకాలే పరిగెత్తాడు.

ఇంతలో నారయ్య ఎదురుగా పరిగెత్తుకొస్తున్నాడు. సుందర్రావు కనబడగానే, ''ఏడీ? వాడేడీ?'' అని అడిగాడు.

సుందర్రావు ఆయాసంతో నిల్చున్నాడు. అప్రయత్నంగా అతడి నోటివెంట ''ఏమో?'' అనే మాటలు వెలువడినాయి.

ఆ మాటలతో నారయ్య మళ్ళీ పరిగెత్తటం మొదలుపెట్టాడు. సుందర్రావు ఎటూ తోచక, ఏమి చెయ్యాలో నిశ్చయించుకోలేక క్షణంసేపు అక్కడే నిల్చున్నాడు

ఇంతలో ''అబ్బా! సుందరం!'' అన్న లతీఫ్ కేక హృదయ విదారంగ విన్పించింది. ఆకేక వినటంతోనే సుందర్రావు నిశ్చేష్టుడయ్యాడు. వెంటనే తేరుకొని అటుకేసి పరిగెత్తాడు.

అప్పటికే లతీఫ్ కేక విన్న నారయ్య, ఇంకా కొంతమంది గ్రామస్థులూ లాంతర్లతో అటు పరిగెత్తారు. లతీఫ్ దాదాపు స్పృహ లేకుండా పడి ఉన్నాడు. తలమీద గాయమయి, తలంతా నెత్తురు మడుగైపోయింది. దుస్తులనిండా ఎర్రటి మరకలున్నాయి. నుదురుమీద ఏర్పడిన గాయంలోనుండి నెత్తురు స్రవిస్తోంది. నారయ్య లతీఫ్‌ను ఆ పరిస్థితిలో చూడగానే ''లతీఫ్ ఏమిటిది?'' అంటూ తన తలకు చుట్టుకొన్న తువ్వాలుతీసి, లతీఫ్ గాయానికి గట్టిగా కట్టాడు. ''మీలో ఎవరన్నా చెంబుడు నీళ్ళు తీసుకురండి'' అన్నాడు. ఇద్దరు ముగ్గురు నీళ్ళకోసరం పరిగెత్తారు. నీళ్ళు వచ్చాక నారయ్య తువ్వాలును నీళ్ళలో తడిపి గాయం తుడిచి మళ్ళీ కట్టాడు. ఆ తరువాత ఇంకో ఇద్దరు సహాయంతో లతీఫ్‌ను పక్కనేవున్న గుడిసెలోకి చేర్చారు.

పది నిముషాల తరువాత లతీఫ్‌కు తెలివి వచ్చింది. మెల్లిగా కళ్ళు తెరిచి చుట్టూ కలియజూశాడు. నారయ్య ఆదుర్దాగా లతీఫ్ ముఖంపై వంగి, ''ఎట్లావున్నది లతీఫ్'' అని అడిగాడు.

లతీఫ్ నీరసంగా, ''ఫరవాలేదు. వాడు పారిపొయ్యాడా?'' అన్నాడు.

''ఆ! పోయినట్టే ఉన్నాడు నాయాలు. ఈసారి దొరకనీ? గుడిసెలో పెళ్ళాం పిల్లలయినా లేరు. నా పామిరంగా. ఆళ్ళనయినా స్టేషనుకు ఈడ్చుకెడుదును'' అన్నాడు నారయ్య.

సుందర్రావు నోటి మాటలేక అట్లాగే నిల్చున్నాడు. తన స్నేహితుడు లతీఫ్ ఆ స్థితిలో పడి ఉండటం చూచేసరికి అతడి నోటినుంచి మాటలు రాలేదు. ఇదంతా తను చేసిందేనన్న భావన అతడి హృదయంలో త్రుటిలో మెరిసింది. లతీఫ్ ఆ రకంగా రక్తపు మడుగులో ఉండటానికి తనే బాధ్యుడు. నరసింహుల్ని తను బంధించిఉంటే ఇదంతా జరిగేదే కాదు. తన అసమర్థతే ఆప్తమిత్రుడికి ప్రాణాపాయకరమయిందేనన్న బాధ అతడిని పెన వేసుకుపోయింది.

''సుందరం ఏదన్నా ఎద్దుబండిని తెప్పించే ఏర్పాటు చెయ్యి. లతీఫ్‌ను తీసుకెళ్ళాలి'' అన్నాడు నారయ్య.

తీరంగానే గాయపడిన లతీఫ్‌ను బండిలో ఎక్కించి తాము తెచ్చిన సైకిళ్ళు గ్రామ మునసబు ఇంటిలోవేవుంచి, సుందర్రావు, నారయ్య పినసందిపాడు బయలు దేరారు.

## 3

''ఈరోజు సెలవు దినమని తనకు ఆయన నిన్న చెప్పారు. అయినా ఖాకీ నిక్కరు, చొక్కా తొడుక్కుంటూ, ఎక్కడికో బయలు దేరడానికి తయారవుతున్నారు'' అని నళిని మనస్సు బాధపడ్డది. ఖాకీ నిక్కరు, బుష్‌కోటూ వేసుకొంటున్న సుందర్రావును చూస్తుంటే. ''డ్యూటీ రోజుల్లో సరేసరి. కంటికే కనబడరు. ఇక శలవు అనుకొన్న రోజూ ఇంతేనా? ఆ ఒక్క రోజునయినా ఆయన నా కళ్ళ ఎదుట ఉండే అదృష్టం నాకు లేదా?'' అనుకొన్న దామె మనస్సులో.

''ఇవాళ సెలవుగదుటండీ? మళ్ళీ డ్రస్సు వేసుకొంటున్నారేం?'' అన్న దామె సుందర్రావుతో.

''తెనాలివరకూ వెళ్ళివస్తాను నళినీ. నీకు తెలుసుగా? లతీఫ్ ఆసుపత్రిలో ఉన్నాడు. ఈ వారం రోజులూ డ్యూటీ చేస్తున్నానేగాని, మనస్సంతా తెనాలిలోనే ఉన్నది. చెప్పానుగదూ? ఆ దెబ్బకు మరొకడయితే ఈ పాటికి 'హరీ' మనేవాడు. లతీఫ్ కాబట్టి ఇంకా ప్రాణాలతో ఉన్నాడు.''

నళిని సమాధానం చెప్పలేదు. అట్లాగే నిల్చుని సుందర్రావు చెబుతున్నవి వింటున్నది.

''ఆ సంఘటన తలుచుకొన్నప్పుడల్లా నా మనస్సు బాధపడుతుంది నళినీ. లతీఫ్ ఇట్లా ఆస్పత్రిలో



''...ఇరవయి వేలు నేను పుచ్చుతున్నానన్న వార్త అబద్ధం! ఇరవయి వేలు మా అన్నయ్య అల్లుడి కిప్పించా దంతే!...''

దెబ్బలతో పడిఉండడానికి నేనే కదూ కారణం ? ఆ నరసింహాలు దొంగ ఏడుపును విశ్వసించక వాణ్ణి అప్పుడే బంధించిఉంటే లతీఫ్‌కు యీ ప్రమాదం తప్పేదికదా ? నేను ఆ క్షణంలో తొచ్చాడటంతో నరసింహాలు నా బలహీనత కనిపెట్టి పారి పొయ్యాడు. అటువేపు లతీఫ్ తారసపడటంతో

# ప్రాయశ్చిత్తం

అతడిని కిందికి తోసి పక్కనే ఉన్న పెద్ద బండ రాయితో చావమోది పారిపొయ్యాడు ...."

"ఇంకా నయం. నా అదృష్టం బాగున్నది. మీరే అడ్డం వెళ్లిఉంటే ....." ఆ పై మాటలు నళిని నోటినుండి బయటకు రాలేదు.

"అవేం మాటలు నళినీ ? అదృష్టం ఎందు కనుకోవాలి ? నా బాధ్యతను సరిగా నిర్వహించ లేదనుకొంటాను నేను. నా విధి—నిర్వహణలో అటు వంటి ప్రమాదం జరిగినా విచారపడవలసిందేమీ లేదు."

నళిని సమాధానం యివ్వలేదు.

"నేను తెనాలి వెళ్లి మధ్యాహ్నానికల్లా వచ్చే



స్తా. వేడివేడిగా ఒక కప్పు కాఫీ యివ్వు. నీపేరు చెప్పుకుని తాగుతాను."

నళిని మాట్లాడకుండా లోపలి కెళ్ళింది.

పది నిముషా లనంతరం సుందర్రావు కాలి—నడకను బయలుదేరాడు. మైలున్నర నడిచి నంది వెలుగు చేరుకుని అక్కడనుంచి బస్సులో తెనాలి వెళ్ళాలని సంకల్పం. డొంకదారివెంట నడుస్తుంటే, యిందాక నళిని "యింకా నయం. నా అదృష్టం బాగుంది ...." అన్న మాటలు గుర్తుకొచ్చినయ్. నిజమే. తానే నరసింహాన్ని పట్టుకోవటానికి ప్రయత్నించి ఉంటే, యిప్పుడు లతీఫ్ ఉన్న స్థలంలో తాను ఉండేవాడు. లతీఫ్ శరీరం, ఉక్కు కనుక తలమీద తగిలిన అంతటి గాయానికి ప్రాణం పోలేదు. తనయితే .... తానయితే ఏమయ్యేవాడోననే భావన సుందర్రావు మనస్సులో కలుగగానే అతడి వళ్ళు జలదరించింది. తనకు సంభవించి ఉండేదన్న మృత్యువును తలుచుకొన్నమాత్రాన అతడు వణికిపొయ్యాడు. తను చనిపోతే తన తండ్రి, సరోజ, నళిని ఏమయిపొయ్యేవారు ? తన తండ్రి అష్టకష్టా లనుభవించి ఏదో రకంగా సరోజ వివాహం చేసి, ఆమెను అత్తవారింటికి పంపేవాడు. తన నళిని గతేమయ్యేది ? చిరునవ్వుతో వెలిగిపోయే అంత అందమయిన ముఖం మేఘావృతమయిన నీలాకాశం వలె కాంతివిహీనమైపోతుంది తను లేకపోతే. తను లేని ఆమె జీవితానికి అర్థం ఏముంది? ఆమెను ఎవ్వరాదరిస్తారు ? తన కష్టసుఖాలు ఎవరితో చెప్పుకొంటుంది ? ఒక వ్యక్తి జీవితంతో మరో వ్యక్తి జీవితం పెనవేసుకపోతే యిదే ఉపద్రవం. ఆ పెనవేసుకపోవటంలో ఆనందం, జీవం, అన్నీ ఉండవచ్చు. కాని, ఎడబాటంటూ జరిగితే అది దుస్సాధ్యమై మిగిలిన జీవితాన్ని నరక తుల్యం చేస్తుంది. మానవజీవితంలో ఈ ప్రేమలూ, ఆపేక్షలూ, మమకారాలూ తప్పవు. అవి ఉన్నంతవరకు ఆత్మక్షోభ, దుఃఖం తప్పవు....

ఆలోచనల పరంపరలతోనే నందివెలుగు చేరుకొన్నాడు సుందర్రావు. సమయానికి రెడీగా బస్సు ఏదీ లేదు. ఒక్క గుంటూరు—తెనాలి రోడ్డు ఒకటే గాక, ఇంకా నందివెలుగు మీదుగా రెండు బస్సు మార్గాలు వెడతాయి. ఇది చిన్న కూడలి వంటిది. అన్నీ తెనాలి వెళ్ళవలసినవే. అయినప్పటికీ ఒక్క బస్సు కూడ లేదు.

పావుగంట నిల్చున్నా బస్సు రాలేదు. ఇంతలో గుంటూరు నుంచి ఏదో లారీ రావటం కనిపించింది సుందర్రావుకు. రెండడుగులు ముందుకు వేసి, చెయ్యి ఎత్తి లారీకి ఎదురుగా నిల్చున్నాడు. ఖాకీ లాగూ, తెల్ల బుష్‌కోటూ, బూట్లూ చూసి లారీ—డ్రైవరు లారీ ఆపాడు.

"లారీ తెనాలి పోతుందా ?" అని ప్రశ్నించాడు సుందర్రావు.


లారీ—డ్రైవరు సుందర్రావును పోలీసు కానిస్టేబుల్‌గా గుర్తుపట్టాడు. "ఎక్కండయ్యా" అన్నాడు నమ్రతగా.

సుందర్రావు ఆసుపత్రి చేరేసరికి ఉదయం పదిగంట లయింది. అప్పుడే సర్జను వచ్చి చూసి వెళ్ళాడు. లతీఫ్ మంచంవద్ద యిద్దరు స్త్రీలు తలనిండా ముసుగు వేసుకొని కూర్చుని ఉన్నారు. సుందర్రావును చూడగానే యిద్దరూ లేచి నిల్చుని తమ తలమీది ముసుగును ముఖంమీదకు లాక్కుని కొద్దిగా పక్కకు తొలిగారు.

సుందర్రావు లతీఫ్ దగ్గరికి వెళ్ళాడు. అతడి తలనిండా కట్లు ఉన్నాయి. పెద్ద ఆపరేషన్ చేయవలసివచ్చింది. తన ప్రతిభ ఏమీలేదని భగవంతుడి దయ, లతీఫ్‌కు యింకా జీవించవలసిన గీత ఉండటంచేతనే అతడు బ్రతికాడనీ ఆపరేషన్ చేసిన సర్జనే చెప్పాడు. సుందర్రావును చూడగానే లతీఫ్ ముఖంలో సంతోషం వెల్లివిరిసింది.

సుందర్రావు మంచంపక్కనే ఉన్న చిన్న బల్లమీద కూర్చున్నాడు. "ఇప్పుడెట్లా ఉన్నది లతీఫ్ ?" అని అడిగాడు.

38వ పేజీ చూడండి



"ఇంకేం ఫరవాలేదు భాయీ. గండం గడిచి పోయిందని డాక్టరు చెప్పారు అంతా నీ చలవ! నీవు, నారాయ్య శ్రమపడి ఆ రాత్రికి రాత్రి నన్ను యిక్కడకు తీసుకురాకపోతే యీపాటికి బ్రతికి ఉండేవాడినే కాదనుకో."

"అదంతా యిప్పు డెందుకు లతీఫ్? స్నేహితులన్న తరువాత ఒకళ్ల కొకళ్లం సహాయం చేసుకోకపోతే ఎట్లా? .... యిప్పుడేమయినా పళ్లు తేవాలా?"

# ప్రాయశ్చిత్తం

25-వ పేజీ తరువాయి

"ఏమీ వద్దు భాయీ! మా తమ్ముడు పళ్లు ఇచ్చి వెళ్లాడు. ఇంకా ఉన్నాయి .... సరే గాని నరసింహులు దొరికాడా?"

"ఇంకాలేదు లతీఫ్! ఎక్కడున్నాడో అచూకీ తెలియటంలేదు సబ్‌యిన్‌స్పెక్టరు ఎంతో ప్రయత్నము చేస్తున్నారు. ఈసారి దొరికితే పదేళ్లు నా జైలుశిక్ష తప్పదంటున్నారు."

"ఆ రాత్రి అసలు వాడు నా చేతులోంచి తప్పించుకొనేవాడేనా? అంతా ఛాన్సు! వాడికి ఛాన్సు దొరికింది. ఒక్క తోపున క్రిందికి తోసి రాయి తీసుకుని కొట్టి పారిపోయ్యాడు. ......"

నరసింహులు వెంటబడి తనవెంటే పరిగెత్తుకొచ్చినట్టు, తన బలహీనత వల్లనే వాడు తప్పించుకొన్నట్టు సుందర్రావు లతీఫ్‌తో చెప్పలేదు. ఆ విషయాలు ఎన్నిసార్లు చెబుదా మనుకొన్నా మాటలు గొంతులోనుంచి పెగిలి యివతలకు రాలేకపోయినవి.

అరగంట లతీఫ్ దగ్గర కూర్చున్న తరువాత "వెళ్లి వస్తానని" చెప్పి సుందర్రావు బయలుదేరాడు. అంతవరకు యిందాకటి స్త్రీలు పక్కనే నిల్చుని ఉన్నారు. సుందర్రావు లేచి నిల్చుని వెనక్కి తిరగ్గానే అప్రయత్నంగా ఆ ఇద్దరి స్త్రీలలో ఒకామె ముఖం చూడటం జరిగింది. ఆమె యువతి. బహుశా లతీఫ్—భార్య అయివుంటుం దనుకొన్నాడు. సుందర్రావు. ఆమె ముఖంలోని ఆందోళన అతని మనస్సును విపరీతంగా కలవరపెట్టింది. కళాహీనమైన ఆమె ముఖమే దారి పొడుగునా అతడి కళ్లముందు మెదలసాగింది. దీనికి అంతటికీ తనే బాధ్యుడు. తన మూలాన్నే యిన్ని ప్రాణులు ఖేదపడుతున్నాయి. ఇందుకు తాను ప్రాయశ్చిత్తం చేసుకుతీరాలి. అప్పుడు గాని, తనకు మనశ్శాంతి లేదు....

సుందర్రావు పిననందిపాడు చేరగానే యింటికి వెళ్లకుండా సరాసరి పోలీసు—స్టేషనుకు వెళ్లాడు. అప్పుడు పదకొండు గంటలయి ఉంటుంది. వెంకటస్వామి ఆఫీసులోనే ఉన్నాడు. ఠీవిగా కుర్చీలో కూర్చుని, రెండు కాళ్లను ఎదురుగా ఉన్న టేబులుమీద జాపి, చుట్ట కాలుస్తూ పేపరు చదువుతున్నాడు. వరండాలో శేషగిరీ, ధర్మదాసూ కూర్చుని ఒకే అపరాధ పరిశోధక నవలను యిద్దరూ చదువుతున్నారు. యేసుపాదం తన టేబులు ముందు కూర్చుని పోర్టబుల్ టైపు రైటరు మీద టైపు చేసుకుంటున్నాడు. అతడి ప్రక్కనే యిద్దరు నడివయస్సు గ్రామస్థులు చేతులు కట్టుకొని నిల్చుని ఉన్నారు.

సుందర్రావు లోపలికెళ్లి వెంకటస్వామి—టేబుల్ ముందు అటెంక్షన్‌లో నిలబడి శెల్యూట్ చేశాడు.

వెంకటస్వామి తలెత్తి తలను కొద్దిగా ఆడించి "ఏమిటోయ్? యిట్లా వచ్చావేం? ఇవ్వాళ నీకు ఆఫ్ కదూ?" అన్నాడు.

"అవును సార్. ఇప్పుడే తెనాలినుంచి వస్తున్నాను. ఆస్పటల్‌కు వెళ్లి లతీఫ్‌ను చూసి వస్తున్నాను."

"ఓ! గుడ్. కులాసాగా ఉన్నాడా? మాట్లాడాడా?"

"కులాసాగనే ఉన్నాడు సార్. ఇంకా పూర్తిగా కోలుకోలేదు కాని, పరిస్థితి మెరుగయిందండీ."

"ఊ" అంటూ వెంకటస్వామి మళ్లీ పేపరు చదవటంలో నిమగ్నుడయ్యాడు.

"నరసింహులు జాడ ఏమయినా తెలిసిందా సార్?"

వెంకటస్వామి పుస్తకం ఆశ్చర్యంతో తలెత్తి చూశాడు. చేసేది పోలీసు ఉద్యోగమే అయినా సుందర్రావు ఇటువంటి విషయాలు తనంతట


## రుజువైన పామాలివ్ పద్ధతితో మీ శిరోజాలను సౌందర్యవంతం చేసుకొనండి






### పామాలివ్ పెర్‌ఫ్యూమ్డ్ కోకొనెట్ హెయిర్ ఆయిల్...

మీ జుత్తును పోషిస్తుంది. నిడుపైన, ఒత్తుగావున్న జుత్తు పామాలివ్‌తో సహజంగా అమరుతుంది. మనోహరమైన మూడు సువాసనలతో దొరుకుతుంది గులాబి, లవెండర్, మల్లె.




### పామాలివ్ కోకొనెట్ ఆయిలు షాంపూ...

ప్రఖ్యాత పద్ధతితో ప్రశస్తమైన కొబ్బరి నూనెతో ప్రత్యేకంగా తయారు చేసినది. దీనిని ఉపయోగిస్తే జుత్తుకు కొత్త అందం సమకూడుతుంది. పామాలివ్ యొక్క అపారమైన, పరిపోషక నురగ మీ జుత్తును, తలమీది చర్మాన్ని చక్కగా పరిశుభ్రపరుస్తుంది. మీ జుత్తు కుసుమ కోమలంగా, ఆరోగ్యంగా పెరుగుతుంది.

అధునాతన భారతీయనారులు శిరోజసౌందర్యం కోసం పామాలివ్ ఎంచుకొంటారు

PCH-50.1 TEL.

తానే ప్రస్తావించటం యిదే మొదటిసారి. చెప్పిన పని చేయటమే గాని, తనంతట తాను నేరస్తుల గురించి ఆచూకీ తీయటానికి ప్రయత్నం చేయటం, దొంగలను పట్టుకోవటంలో ఆసక్తి చూపటం సుందర్రావు ఎన్నడూ ఎరుగడు. అందుకే అతడు కానుస్టేబుళ్లందరిలోకి 'అశక్తు'డని పేరు తెచ్చుకొన్నాడు. ఆ కారణంచేతనే అతడిని ఎప్పుడూ స్టేషను 'సెంట్రీగా'నే నియమించేవారు.

"అదేమిటోయ్! ఎన్నడూ లేనిది ఈరోజు నీ యంతటనువ్వే అడుగుతున్నావు?" అన్నాడు వెంకటస్వామి ఆశ్చర్యంతో.

"వాడిని పట్టుకొని జైలులో వేసేదాకా నా మనస్సుకు స్థిమితం లేదు సార్. చేసిన దొంగతనానికి తోడు మనలో ఒకడిని కొట్టి పోయాడా? ఈసారి వాడి ఆచూకి తెలిసినప్పుడు ఒకళ్లూ ఇద్దరూ కాదు సార్. స్టేషను స్టాఫ్ అంతా వెళ్లాలి సార్ ...." అని క్షణంసేపు ఊరుకుని "నన్ను కూడా తప్పకుండ తీసికెళ్లండి సార్" అన్నాడు సుందర్రావు, ఆవేశంగా.

"సరేలేవయ్. వాడు ఎక్కడుంటున్నాడో ఇంకా ఆచూకీ తెలియలేదు. దొరక్కపోడులే" అంటూ వెంకటస్వామి తిరిగి కాగితాలలో మునిగిపోయాడు.

"ఇక నేను వెళ్లి వస్తాను సార్" అంటూ సుందర్రావు మరోసారి సెల్యూట్ చేసి వెనక్కి తిరిగాడు.

సుందర్రావు వరండాలో కొచ్చేసరికి శేషగిరి తలెత్తి చూసి కొద్దిగా నవ్వుతూ "ఎస్. ఐ. గారికి తైరు కొట్టడం నువ్వు మొదలెట్టావ సుందరం?" అన్నాడు.

ధర్మదాసు కూడా నవ్వుతూ "పైకివచ్చే మార్గం అదేనయ్యా శేషగిరీ. సుందర్రావుకు ఆ మాట నే ఎప్పుడో చెప్పాను. అంతో యింతో చదువుకొన్నవాడు పై వాళ్లతో మంచిగా ఉంటే, ఎప్పటికయినా పనికొస్తుంది. ఇన్నాళ్లూ నా మాటలు చెవి కెక్కలేదు. ఇప్పుడు తెలివొచ్చినట్టుంది. అవునా?" అన్నాడు. తానేదో సత్యం కని పెట్టిన తృప్తి అతడి ముఖంలో గోచరించింది. సుందర్రావు వారి మాటలకు జవాబు చెప్పకుండా, ఒక చిరునవ్వు నవ్వి వెళిపోయాడు.

ఇంటికి తిరిగొస్తుంటే తన ధర్మం తాను సక్రమంగా నిర్వర్తించినట్లు సుందర్రావు తృప్తి పడ్డాడు. నరసింహుల్ని పట్టుకోవటంలో తను కనబరచిన ఆసక్తి తన 'పాపాన్ని' కొంతవరకు తగ్గిస్తుంది. రేపు నరసింహుల్ని పట్టుకునే పనిలో తనూ భాగస్వామి అయితే, అంతకంటే నరసింహుల్ని అదృష్టంకొద్దీ తన చేతులతోనే బంధిస్తే తన పాపం పూర్తిగా మాసిపోతుంది. అప్పుడే లతీఫ్ అనుభవిస్తున్న యాతనకు పరోక్షంగా కారకుడయిన తనకు యీ పాపంనుండి విముక్తి లభిస్తుంది. తను చేసిన దానికి ప్రాయశ్చిత్తం చేసుకొన్నవాడవుతాడు.

మనస్సులో కోరుకున్నాడే కాని, తన కోరిక అక్షరాలా రెండు మూడు రోజులలో నెరవేరబోతోందని సుందర్రావు కలలో కూడ భావించలేదు.

# 4

అర్ధరాత్రి సుమారు పదకొండు గంటల సమయం. పినసందిపాడు పోలీసు—స్టేషనులో దీపాలు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. స్టేషను కానిస్టేబుళ్లందరూ యూనిఫారం వేసుకొని అటు యిటు తిరుగుతున్నారు. అంతా హడావిడిగా ఉన్నది. పోలీసు—స్టేషను ముందు జీపు ఒకటి ఆగిఉన్నది. వరండాలో ఒక కుర్చీలో వెంకటస్వామి, యూనిఫారంలో పిస్తోలు బెల్టుకు తగిలించుకొని చేతిలోని కర్రను అటు యిటు ఆడిస్తూ కూర్చుని ఉన్నాడు. అతడి పక్కనే యేసుపాదం నిల్చుని ఉన్నాడు. వారికి కొద్ది దూరంలో కాన్‌స్టేబుళ్లందరూ నిల్చుని ఉన్నారు. వారికి పక్కగానే శేషగిరి తుపాకిని తుడుస్తూ కూర్చున్నాడు. నిల్చునిఉన్న కాన్‌స్టేబుళ్లలో సుందర్రావు కూడ ఒకడు.

వెంకటస్వామి చేతి — గడియారం చూసుకుని "పది ముప్పావయిందోయ్ యేసుపాదం! మనం ఇక బయలుదేరుదామా? వాడు పదకొండున్నరకు యింటికొస్తాడని కదూ మనకు ఆచూకి తెలిసింది?" అన్నాడు.

"చిత్తం సార్!"

"డ్రయివర్" అంటూ వెంకటస్వామి కేకేశాడు.

"ఈ సారి స్టేజిమీదకి రాళ్లు విసరడానికి వీల్లేనిచోట గానకచేరీ చేస్తానన్నావ్! ఎక్కడేమిటి?"

"రేడియో స్టేషన్‌లో!"

కె. రంగారావు

జీపు దగ్గిరున్న డ్రయివర్ "సార్" అంటూ వచ్చాడు.

"మనం సుమారు పదకొండున్నరకు పాడివరం చేరాలోయ్. యిప్పుడు పదిముప్పావయింది. మెల్లిగా బయలుదేరుదామా?"

"బయలుదేరితేనే మంచిది సార్! రోడ్డు కూడా సరిగా లేదు. తాపీగా వెళ్లొచ్చు."

"రైట్; యేసుపాదం! అందరినీ జీపులో ఎక్కమను. ధర్మదాసును సెంట్రీగా అట్టేపెట్టు" అంటూ, వెంకటస్వామి కుర్చీలోనుంచి లేచాడు. చేతిలోని టోపి నెత్తిన పెట్టుకుని, బెల్టుకున్న పిస్తోలును ఒకసారి తడిమి చూసుకుని చేతికర్రను విలాసంగా ఆడిస్తూ అతడు జీపు దగ్గరకు వెడుతుంటే, అతణ్ణి అనుసరించా రందరూ.

మరో అయిదు నిముషాలకు అందరిని ఎక్కించుకొని 'బుర్' మని చప్పుడు చేసుకొంటూ, జీపు బయలుదేరింది.

నరసింహులు కొద్దిరోజులుగా పాడివరంలో ఉంటున్నాడని వెంకటస్వామికి ఆచూకీ దొరికింది. తెలిసిన ఆచూకిని ధ్రువపరుచుకొన్నాక, అతడు ఒకరోజు తెనాలి వెళ్లి, పై అధికారులకు అంతా విశదపరచి, నరసింహుల్ని బంధించి తీసుకురావటానికి ఒక్కరాత్రి ఉపయోగించుకోవటానికి జీపు తెచ్చాడు. పాడివరం పినసందిపాడుకు సుమారు పది మైళ్ల దూరంలో ఉన్నది. ఈ పోలీసు — స్టేషను అధికార పరిధిలోని చివరి గ్రామం అదే. ఆ గ్రామపు గత చరిత్ర పోలీసు అధికారులను భయకంపితులను చేసేటువంటిది. ఈ గ్రామం ఎప్పుడూ పోలీసు అధికారులకు వెన్నుపోటు వంటిదే. ఒకప్పుడు పోలీసుస్టేషన్ను పినసందిపాడులో గాక, పాడివరంలోనే పెట్టాలనే ప్రతిపాదన ఉండేది. కాని కొన్ని చిక్కుల మూలంగా అది నెరవేరలేదు. ఇదొక కుగ్రామం. దీనికి అతి దగ్గరగా ఉన్న పట్టణం సుమారు పదిహేను మైళ్లలో ఉన్న తెనాలి ఒకటే! ఎండాకాలంలో నామమాత్రంగా పొలాలమధ్య నేర్పడే డొంకదారి తప్పితే ఈ గ్రామానికి యింకో త్రోవ లేదు. మిగతా ఋతువులలో పొలాల గట్లులే శరణ్యం.

జీపు డొంకదారి వెంట పాడివరం చేరుకొనే సరికి పదకొండున్నరయింది. విద్యుచ్ఛక్తి లేని కారణంగా, కటిక చీకటిగా ఉన్నది. గ్రామంలో వీధి—లాంతరలు కూడ ప్రకాశవంతంగా లేవు. ఆకాశం మేఘావృతమయిన కారణంచేత నక్షత్రాలు కూడ అగుపడటంలేదు. గ్రామంలో అధికభాగం పూరిగుడిసెలే. పదికంటె పెంకుటిళ్ళెక్కువలేవు. వెంకటస్వామి జీపును గ్రామం వెలుపలనే ఆపించి తను కిందికి దిగాడు.

అప్పటిదాకా చెట్లచాటున ఉన్న ఒక వ్యక్తి, జీపు ఆగటం చూసి ముందుకు వచ్చాడు. అతడిని చూడగానే వెంకటస్వామి సంతోషంతో "అప్పల నర్సయ్యా?" అని పిలిచాడు.

ఆ వ్యక్తి ముందుకొచ్చి వెంకటస్వామికి నమస్కరించి, "చిత్తం బాబూ" అన్నాడు.

"ఇంకా నువ్వు రాలేదేమిటా అని చూస్తున్నాను. అంతా అనుకొన్నట్టుగానే ఉన్నదా?"

"సిత్తం బాబూ. వాడు తప్ప తాగి గుడిసెలో పడుండాడు. ఇక మీరు పట్టుకోవటమే ఆలస్యం" అన్నాడు అప్పలనర్సయ్య స్వరం తగ్గించి.

"రైట్" అంటూ వెంకటస్వామి తన దళం వేపు తిరిగి, "అంతా నా వెనకాలే రండి" అన్నాడు.

అంతా బిలబిలమంటూ, జీపులోంచి దిగారు. ముందు వెంకటస్వామి, అప్పలనర్సయ్య బయలు దేరారు. వారి వెనకాలే యేసుపాదం, ఆ వెనకాల మిగిలిన బృందం బయలుదేరారు. జీపు—డ్రైవరు జీపులోనే కూర్చున్నాడు.

నడిరేయి; అంతా గాఢాంధకారం. అందరూ నిద్రలో ఉన్నారు. నిశ్శబ్దంగా వెడుతున్న ఈ బృందాన్ని ఎవరూ గమనించలేదు. కుక్కలు కూడా నిద్రలో ఉండి ఉంటాయి. వాటి అరుపులు ఎక్కడా వినబడటంలేదు. ఒక గృహస్థు పెంకుటింట్లోనుంచి బయటికొచ్చి వీళ్లను చూసి, చీకటిలో దొంగలేమో ననుకుని భయంతో 'ఎవరూ' అంటూ చేతిలోని బ్యాటరిలైట్ వెలిగించి పోలీసులని గమనించి వెంటనే వెనుదిరిగి లోని కెళ్లాడు....

గ్రామపు దక్షిణపుటంచు చేరుకోగానే, అప్పల నర్సయ్య "యిక్కడ ఆగాలి బాబూ" అన్నాడు. వెంకటస్వామి, మిగిలిన పరివారం అంతా ఆగారు.

ఆ ప్రదేశం అంతా గుడిసెలతో నిండిఉన్నది. ఒక పద్ధతి ప్రకారం ఆ గుడిసెలు కట్టని కారణాన, అంతా అస్తవ్యస్తంగా ఉన్నది. ఒక బాట అంటూ ఏదీ లేదు. ఊరికి అదే చివరి భాగం. ఆ వెనకాల

